సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



కొలువు కొట్టేద్దాం..

కొలువు సాధించే దిశగా విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకుంటున్నారు. ఆన్‌లైన్‌లోనూ శిక్షణ తీసుకుంటున్నారు. - 8లో



వేసవి సాగు.. లాభాలు బాగు

రబీ పంటలు జోరుగా సాగవుతున్నాయి. ఇవి లాభాలిస్తాయని రైతులు ఆశపడుతున్నారు. - 8లో

కోర్టు అఫీషియల్ రిసీవర్‌గా శ్రీరామ్ శాంతారాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయస్థానంలో అఫీషియల్ రిసీవర్‌గా న్యాయవాది శ్రీరామ్ శాంతారాంను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర న్యాయ విభాగం ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. శాంతారాం నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి రెండు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న రామకృష్ణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుని ఎన్నికకు సంబంధించి గురువారం నామినేషన్ల గడువు ముగిసింది. ఆ సమయానికి రెండు నామినేషన్లు మాత్రమే పడ్డాయి. బుధవారం నాడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నర్తు రామారావు నామినేషన్ వేశారు. గురువారం ఇండిపెండెంట్‌గా ఎ.రామకృష్ణ నామినేషన్‌ను దాఖలు చేశారు. గురువారంతో నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో.. ఇక వీటిని పరిశీలించనున్నారు.

మార్చి 5 నాటికి రెండో విడత రీ సర్వే పూర్తి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో చేపడుతున్న రెండో విడత రీ సర్వే మార్చి 5 నాటికి పూర్తవుతుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సీసీఎల్‌ఏకు వివరించారు. రెండో విడత రీ సర్వేపై భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు గ్రామాలు మినహా దాదాపు రెండో విడత రీసర్వే పూర్తయిందన్నారు. రీ సర్వేను వేగవంతం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సమావేశంలో భూ సర్వే మరియు రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకర రావు, డి-సెక్షన్ పర్యవేక్షకులు సూర్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మార్పులకు అనుగుణంగా బోధన: వీసీ



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తమ మానవ వనరులను తీర్చిదిద్దేదే నిజమైన విద్య అని బీఆర్‌ఏయూ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో బోధన నైపుణ్యాలు, మెలకువలపై నిర్వహిస్తున్న శిక్షణలో రెండోరోజు గురువారం ఆయన మాట్లాడారు. మార్పులకు అనుగుణంగా బోధనలో మార్పులు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధి, పారిశ్రామిక అవసరాలు దృష్టిలో పెట్టుకుని బోధన సిబ్బంది నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్‌సీటీఈ సదరన్ రీజనల్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ గంటా రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానంలో బోధన, పాఠ్యాంశాల్లో మార్పులు అవసరమని పేర్కొన్నారు. ఎస్‌సీటీఈ సదరన్ రీజియన్ కమిటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.పద్మనాభయ్య మాట్లాడుతూ బోధన వృత్తిలో ఉన్న వారు నిరంతరం కొత్త అంశాలు నేర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

'లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు'



ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన గర్భిణితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పద్మజ

నరసన్నపేట: ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి హెచ్చరించారు. గర్భస్థ లింగనిర్ధారణ చట్టం 1994 ప్రకారం తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు, స్కానింగ్ కేంద్రాల్లో ఈ మేరకు నిఘా ఉంచుతున్నామని అన్నారు. స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు అందుతున్న సేవలను ఆమె గురువారం పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా జయశ్రీ వచ్చిన తర్వాత అనేక సేవలు ఉచితంగా అందుతున్నాయని, గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందుతోందని పలువురు తెలిపారు. దీంతో డీఎంహెచ్‌ఓ సంతృప్తి వ్యక్తం చేశారు.



కవిటి: బల్లిపుట్టుగలో ఈనాడు ప్రతుల్ని దహనం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్

పిచ్చి రాతల పచ్చ పైత్యం
తిరగబడిన జనం

- ఈనాడు విషపు వార్తలపై ఆగ్రహం
- పలు చోట్ల నిరసనలు
- పత్రిక కాపీలు దహనం

అబద్ధపు రాతలపై జనంతో పాటు నాయక గణం తిరగబడింది. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా అవాస్తవాలు ప్రచురించడం తగదని అంటూ ఊరూరా 'ఈనాడు' ప్రతులను దహనం చేస్తూ నిరసన తెలిపారు. పచ్చ నాయకులకు కొమ్ము కాస్తూ అధికార పక్షంపై అసత్యాలను ప్రచురిస్తూ.. ప్రజలను మోసం చేయడం సరికాదని నినదించారు. ఒకప్పటిలా రోత రాతలతో జనాలను ఏమార్చడానికి చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వంపై జనం చూపుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే ఇలాంటి వార్తలు వండి వడ్డిస్తున్నారని నేతలు దుమ్మెత్తి పోశారు. –సాక్షి నెట్‌వర్క్

క్షమించరాని నేరం



టీడీపీ ఇమేజీ పెంచాలనే ఉద్దేశంతో ఈనాడు పాత ఫొటోలు పతాక శీర్షికల్లో ముద్రించడం క్షమించరాని నేరం. టీడీపీని భుజాన మోస్తూ ఆ పత్రిక చేస్తున్న పనులు ఇక ఎంత మాత్రం చెల్లబోవు. వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే ఇలా వాస్తవాల వక్రీకరణ చేస్తున్నారు. – జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, పిరియా సాయిరాజ్



రణస్థలం: రణస్థలం క్యాంప్ కార్యాలయంలో ఈనాడు ప్రతుల్ని దహనం చేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్



సంతబొమ్మాళి: గోవిందపురంలో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



ఆమదాలవలసలో నిరసన తెలుపుతున్న తమ్మినేని చిరంజీవినాగ్ తదితరులు

విషం చిమ్ముతున్నారు..



ఒక వర్గానికి కొమ్ము కాస్తూ ప్రభుత్వంపై ఈనాడు విషం చిమ్ముతోంది. అభివృద్ధి, సంక్షేమం ఎల్లో మీడియా కంటికి కనిపించకపోవడం దారుణం. తప్పుడు కథనాలతో జనాలను మభ్యపెడుతున్నారు. – దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ

ప్రజలు నమ్మరు..



టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టారంటూ ఈనాడు పాత ఫొటోలను ప్రచురిస్తూ అబద్ధాలు చెప్పడం సరికాదు. బాబును సీఎం చేసేందుకు ఎల్లో మీడియా ఎంతటి అనైతికానికైనా ఒడిగడుతుంది. రామోజీరావు, బాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరు. – రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

జనం బహిష్కరించాలి..



చంద్రబాబు శ్రేయస్సే ధ్యేయంగా ఈనాడు పనిచేస్తుంది. నిరాధారమైన వార్త ప్రచురించిన పత్రికను జనం బహిష్కరించాలి. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను ఎన్నడూ ఎల్లో మీడియా చూపించదు. కానీ ఇలాంటి అవాస్తవాలు మాత్రం అచ్చు వేస్తుంది. – గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

విద్యుత్ అక్రమాలకు చెక్

- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఆకస్మిక దాడులకు విజిలెన్స్ సన్నద్ధం
- అపరాధ రుసుముల విధింపులపై తక్షణ నోటీసుల జారీ



ఓ మిల్లు వద్ద మెయిన్ వైర్లను డైరెక్ట్‌గా ట్యాపింగ్ చేస్తున్న దృశ్యం



ఓ రైస్ మిల్లు వద్ద మీటర్ బైపాస్ చేయడాన్ని గుర్తించి పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

అరసవల్లి: విద్యుత్ అక్రమాలను నిరోధించేందుకు విజిలెన్స్ అధికారులు నడుం బిగించారు. విద్యుత్ అక్రమాల వల్ల ఆ శాఖకు తీవ్ర నష్టం వస్తోంది. దీని వల్ల జనాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా ఇవ్వడంలో ఇబ్బందులు ఏర్పడతాయి. అందుకే వీటిపై దృష్టి సారించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజిలెన్స్ అధికారులను సూచించారు. ఈ మేరకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో చీఫ్ విజిలెన్స్ అధికారి ఏపీఎల్ ప్రసన్నకుమార్ బృందం దాడులు నిర్వహించడానికి సిద్ధమవుతోంది. వస్తున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ డిమాండ్ మరింత పెరగనున్న నేపథ్యంలో ఇలాంటి చౌర్యాలతో సరఫరాలో ఇబ్బందులు రాకుండా, సంస్థకు నష్టం వాటిల్లకుండా ఉండేలా విజిలెన్స్ శాఖ నడుం బిగించింది. ఇప్పటికే దాదాపుగా ప్రతి నెలా దాడులు నిర్వహిస్తూ వందల్లో కేసులు నమోదు చేస్తున్నప్పటికీ.. చాలా చోట్ల ఇంకా అక్రమంగా విద్యుత్ వినియోగించే చర్యలు పెరుగుతూనే ఉన్నాయి. అధికార బృందాలతో ఆకస్మికంగా దాడులు చేసి, అక్కడికక్కడే అపరాధ రుసుమును ఖరారు చేస్తాయి.

చౌర్యాలపై ప్రత్యేక దృష్టి


అక్రమ విద్యుత్ వినియోగం, చౌర్యం, పర్మిషన్ లేని ఓవర్ లోడ్ వినియోగం, మీటర్ల ట్యాంపరింగ్ వంటి అక్రమాలపై విజిలెన్స్ దృష్టి పెట్టింది. గత మూడేళ్లలో ఈ రకమైన కేసుల సంఖ్య చూస్తే అక్రమార్కులపై అధికారుల చర్యలు స్పష్టం చేస్తాయి. తాజాగా 2022 జనవరి నుంచి డిసెంబర్ వరకు గల కేసుల సంఖ్య, అసెస్‌మెంట్ అమౌంట్, కాంపౌండ్ అమౌంట్‌లను ఖరారు చేసిన వివరాల వార్షిక క్యాలెండర్ నివేదికను కార్పొరేట్ కార్యాలయంలో సీవీఓ ప్రసన్నకుమార్ తాజాగా విడుదల చేశారు. ఈ మేరకు డిస్కం పరిధిలో ఉన్న ఐదు సర్కిళ్ల పరిధిలో 2022 సంవత్సరంలో 6385 కేసుల ద్వారా అసెస్‌మెంట్ రుసుం కింద రూ.5.02 కోట్లు ఫైన్ విధించినట్లు నివేదిక పేర్కొంది.

ధైర్యంగా సమాచారమివ్వండి



ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 38 మండలాల్లో అక్రమంగా విద్యుత్ వినియోగంపై ఎవ్వరైనా ధైర్యంగా మాకు సమాచారాన్ని (సెల్ నంబర్ 9440812815) అందించవచ్చు. అలా ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. అలాగే 1912 టోల్‌ఫ్రీకి కూడా ఫిర్యాదు ఇవ్వవచ్చు. కచ్చితంగా అక్రమాలు జరిగిన చోట దాడులు నిర్వహిస్తాం, ఫైన్లు విధిస్తాం. – ఎం.వెంకటనారాయణ, విజిలెన్స్ సీఐ





26న రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈనెల 26వ తేదీన జరగనున్నట్టు శ్రీకాకుళం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని అల్లూరి సీతారామరాజు స్టేడియం వేదికగా ఉదయం 8 గంటల నుంచి ఎంపికల ప్రక్రియ మొదలవుతుందన్నారు. రాష్ట్ర ఎంపికల్లో ప్రతిభ కనబర్చి ఎంపికైన అథ్లెట్స్ ఆలిండియా యూత్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జిల్లా నుంచి ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అథ్లెట్స్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి (85002 71575)ని సంప్రదించాలని కోరారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

నరసన్నపేట: మండలం పెద్ద కరగాంలో ఇర్రి చంద్రభూషణ్‌ను హత్య చేసిన నిందితులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ డి.రాము తెలిపారు. హత్య చేసినట్లు వారు అంగీకరించారని తెలిపారు. చంద్రభూషణ్ భార్య భాగ్యలక్ష్మితో పాటు ఆమె సోదరుడు శివన్నారాయణను అరెస్టు చేసినట్లు తెలిపారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందన్నారు.

ఆపదలో ఆసరా

- ఏపీ రెడ్‌క్రాస్ యాప్‌లో బ్లడ్‌బ్యాంకుల వివరాలు
- ఇన్‌స్టాల్ చేసుకుంటే ప్రయోజనాలెన్నో..



శ్రీకాకుళం కల్చరల్: ఆపద వేళ క్షతగాత్రులకు రక్తం కావాలంటే కాళ్లు చేతులు ఆడవు. ఎవరిని అడగాలో తోచదు. ఎవరినో పట్టుకుని రక్తం సేకరించే సరికి.. ఉన్న పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. అలాంటి ఆపత్కాలంలో ఒక చిన్న యాప్ మనకు సాయం చేస్తే..? ఎక్కడ ఎంత రక్తం నిల్వ ఉందో చెప్పగలిగితే..? ఏ బ్లడ్‌బ్యాంకుకు వెళ్తే పని జరుగుతుందో సూచించగలిగితే..? ఎంత బాగుంటుందో కదా. అలాంటి ఆలోచనలకు ప్రతిరూపమే ఏపీ రెడ్‌క్రాస్ యాప్. ఈ యాప్‌లో రాష్ట్రంలో ఉండే అన్ని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులకు లింకులు ఉంటాయి. ఆ రక్త సేకరణ కేంద్రాల వివరాలు వస్తాయి. వాటిలో అక్కడ ఏ రక్తం నిల్వ. ఎంత ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు. మన జిల్లాలో ఈ యాప్‌కు సంబంధించి రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు కూడా అనుసంధానం చేశారు. వీటి ద్వారా ప్రమాదం జరిగిన ప్రదేశానికి దగ్గరలో ఉన్న బ్లడ్ బ్యాంకు వివరాలు తెలుసుకుని అక్కడకు వెళ్తే వారికి కావాల్సిన రక్తం దొరుకుతుంది.

రక్తం ఇవ్వవచ్చు కూడా..

రక్తం దానం చేయాలనుకున్నా ఈ యాప్ సాయపడుతుంది. మన ఉన్న ప్రదేశానికి దగ్గరలో ఉన్న బ్లడ్‌బ్యాంకులో నిల్వ వివరాలను బట్టి వారి బ్లడ్ గ్రూపు నిల్వ తక్కువగా ఉంటే దాతలు వెళ్లి రక్తదానం చేయవచ్చు. దీని వల్ల రక్తం కొరత తగ్గుతుంది. రేర్ బ్లడ్ గ్రూపు ఉన్న వారు తమ రక్తాన్ని అవసరమైన వారికి దానం చేసేందుకు అవకాశం ఉంటుంది.

పూర్తి వివరాలకు జిల్లాలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు (08942-272700) నంబరుకు ఫోన్ చేయవచ్చు.

స్వచ్ఛందంగా ముందుకురావచ్చు..



ఈ యాప్ ద్వారా రక్తదాతలు ముందుకు వచ్చి తమ రక్తాన్ని దానం చేయవచ్చు. అవసరమైన వారు రక్త నిల్వల వివరాలు తెలుసుకోవచ్చు. అలాగే రెడ్‌క్రాస్‌లో రక్తకణ విభజన కేంద్రం ఏర్పాటు చేశాం. దీని వల్ల ఏ వ్యక్తికైనా ప్లేట్‌లెట్లు, ప్లాస్మా వంటివి అవసరమైతే ఇవ్వగలుగుతున్నాం. అయితే దీనికి వైద్యుల సహకారం అవసరం. – పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ చైర్మన్

ముగిసిన నామినేషన్ల పర్వం

- మొత్తం 44 నామినేషన్లు దాఖలు
- చివరి రోజున 26 నామినేషన్లు దాఖలు
- 27 వరకూ ఉపసంహరణకు గడువు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. గురువారం చివరి రోజున 26 నామినేషన్లు కలిపి మొత్తం 44 నామినేషన్లు, 70 సెట్లు దాఖలయ్యాయి. ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీ వరకూ అవకాశం కల్పించారు. గురువారం టీడీపీ తరపున మరో అభ్యర్థి నామినేషన్ వేశారు. అనకాపల్లి జిల్లాకు చెందిన గూనూరు మల్లునాయుడు టీడీపీ రెబల్‌గా మారారు. బీసీలకు టికెట్ అంటూ మోసం చేసిన తెలుగుదేశం పార్టీపై ఎదురు తిరుగుతూ.. రెబల్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఈర్లె శ్రీరాములు.. టీడీపీకి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తరపున విశాఖకు చెందిన కొణతాల వెంకట అప్పారావు బరిలో దిగారు.

గత ఎన్నికల కంటే ఎక్కువ మందే...

2017 ఎన్నికల్లో మొత్తం 40 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. 30 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈసారి ఏకంగా 44 నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో కనీసం 8 నుంచి 10 మంది ఉపసంహరించుకునే అవకాశం ఉంది. కాబట్టి.. గత ఎన్నికల కంటే ఎక్కువ మంది తుది పోరుకు బరిలో ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 331 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 3.17 లక్షల బ్యాలెట్ పత్రాలు ముద్రించాలని నిర్ణయించారు. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత.. పట్టభద్రుల ఎన్నికల బరిలో ఎంత మంది నిలుస్తారు.? వారి పేర్లని ఆర్డర్ల ప్రకారం ఎలా అమర్చాలి అనే అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని బ్యాలెట్ పత్రాల ముద్రణకు సన్నద్ధమవుతామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ఏఆర్‌ఓగా వ్యవహరిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. ఇప్పటికే వైట్ బ్యాలెట్ పేపర్లకు సంబంధించి పూర్తి బండిల్స్ సిద్ధంగా ఉంచామనీ.. 28వ తేదీ తర్వాత ముద్రణకు పంపించనున్నట్లు తెలిపారు.

ఉద్దానంలో 25న ప్రత్యేక వైద్య శిబిరాలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్దానాన్ని పట్టి పీడిస్తున్న కిడ్నీ వ్యాధిని తరిమికొట్టడానికి ప్రభుత్వంతో పాటు సామాజిక, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ముందుకురావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. జిల్లా జడ్జి చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ 25వ తేదీన ఉద్దానంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలంతా వినియోగించుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే మరణాల రేటు నివారించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇదివరకు న్యాయ సంబంధిత అవగాహన సదస్సులు మాత్రమే నిర్వహించిందని, ఇకపై ఆరోగ్య సమస్యలపై కూడా దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే ఉద్దానంలో మూడు ఉచిత వైద్య పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి 120 మంది బాధితులను గుర్తించి చికిత్స అందించామన్నారు. 25న సోంపేట మండలం బట్టిగల్లూరు, హరిపురం గ్రామాల్లో గల వైద్యశాలల్లో శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ రెండు గ్రామాలే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కిడ్నీ బాధితులు ఉంటే వారికి వైద్య సేవలు అందిస్తామన్నారు. అంతా ఉచితమేనని స్పష్టం చేశారు.

మార్చి 18న ప్రత్యేక లోక్ అదాలత్

మార్చి 18న మెగా ప్రత్యేక లోక్ అదాలత్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా చెప్పారు. ఇటీవల కాలంలో యువత ఎక్కువగా న్యాయస్థానాలను కుటుంబ సమస్యలతో ఆశ్రయిస్తున్నారని, వారికి ఈ అదాలత్ రాజీ మార్గంలో మంచి పరిష్కారం వస్తుందని తెలిపారు. దంపతులు తమ మధ్య సమస్యలను పరిష్కరించుకుని సంతోషంగా జీవితాలను గడపాలన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శతచండీ యాగం



శతచండీయాగం చేస్తున్న రుత్వికులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ (పీఠం)దేవాలయం వద్ద ఐదు రోజుల పాటు జరిగే శతచండీయాగం గురువారం ప్రారంభమైంది. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో 25 మంది రుత్వికులతో జరిగిన ఈ యాగంలో పూజలు, సూర్యనమస్కారాలు, వేదపారాయణలు, మహాలింగార్చనలు, మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకాలు జరిగాయి. కంచి కామకోటిపీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి మహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకం, త్రికాలార్చనలు చేశారు. పూజా కార్యక్రమాలకు విచ్చేసిన స్వామీజీని ఎస్పీ రాధిక, ఏఎస్పీ విఠలేశ్వరరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన రావు తదితరులు దర్శించుకున్నారు.

'కిందిస్థాయి ఉద్యోగులపై వేధింపులు ఆపాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: తపాలా శాఖలో ఆచరణ సాధ్యం కాని టార్గెట్ల పేరుతో ఉన్నతాధికారులు కింది స్థాయి ఉద్యోగులను వేధిస్తున్నారని, వీటిని వెంటనే ఆపాలని ఆంధ్రప్రదేశ్ తపాలా ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. తపాలా శాఖలో ఉన్నతాధికారుల వేధింపులకు నిరసనగా జిల్లా వ్యాప్త కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాకుళంలోని ప్రధాన తపాలాశాఖ కార్యాలయం వద్ద తపాలా ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ తపాలా శాఖలో టార్గెట్ల పేరుతో అధికారులు ఉద్యోగులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక మచిలీపట్నంలో ఒక సబ్ పోస్ట్‌మాస్టర్ గుండెపోటుతో అకాలమరణం చెందారన్నారు. ఇప్పటికైనా అధికారులు వేధింపులు ఆపకపోతే మార్చి 10వ తేదీన దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానులలో ఒకరోజు ధర్నా కార్యక్రమాన్ని, మార్చినెల 13వ తేదీన న్యూఢిల్లీలోని డాక్‌భవన్ ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని ఉద్యోగ సంఘాలు నిర్ణయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకులు గణపతి, బాబూరావు, జ్యోతీశ్వరరావు, వేణుగోపాలరావు, బాబూరావు, చంద్రకిరణ్, వెంకటేష్, రాంబాబు, రమేష్, ఢిల్లేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

నైపుణ్యం చూపిద్దాం.. కొలువు కొట్టేద్దాం



ఆన్‌లైన్ శిక్షణలో బీఆర్‌ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థులు

- క్యాంపస్ డ్రైవ్‌లకు విద్యార్థులు సన్నద్ధం
- ఆన్‌లైన్ శిక్షణలో ఇంజినీరింగ్ చివరి సెమిస్టర్ విద్యార్థులు బిజీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులకు కొలువు అత్యంత కీలకం. చివరి సెమిస్టర్ చదువుతున్నవారంతా క్యాంపస్ ఇంటర్వ్యూలకు సిద్ధమవుతున్నారు. కొలువు సాధించాలనే ప్రతిభ చాలా అవసరం. దీంతో క్యాంపస్ ఇంటర్వ్యూలకు తగ్గ నైపుణ్యం కోసం ఆన్‌లైన్ శిక్షణ తీసుకుంటున్నారు. కళాశాలల్లో సైతం ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఇంజినీరింగ్‌లో 90 శాతం మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు ప్రాధాన్యత నిస్తుండగా.. పది శాతం మంది ఉన్నత చదువులు, ప్రభుత్వ ఉద్యోగాల బాటలో ఉన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు చివరి సెమిస్టర్ విద్యార్థులు హాజరవుతారు. కంపెనీలు ఎంపిక చేసి అఫర్ లెటర్లు అందజేస్తారు. అనంతరం వీలుబట్టి ఉద్యోగాలకు పిలుస్తారు. జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఐతం, శ్రీశివానీ, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా, రాజాంలో జీఎంఆర్‌ఐటీలో సైతం జిల్లా విద్యార్థులు చదువుతున్నారు. ఏటా 1800 నుంచి 2000 వరకు విద్యార్థులు చివరి ఏడాది రిలీవ్ అవుతున్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సీఎస్ఈ, ఈసీఈతో పాటు ట్రిపుల్ఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌ల విద్యార్థులు కొలువు సాధిస్తున్నారు. కనీస వార్షిక వేతనం రూ. 3.50 లక్షలు నుంచి రూ. 12 లక్షలు వరకు జిల్లా వాసులు ప్యాకేజీలు సాధిస్తున్నారు. చివరి సెమిస్టర్ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా క్యాంపస్ ఎంపికలకు సిద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీలపై అవగాహన ఉండాలంటున్నారు.

ఇవి కీలకం..

విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక కావాలంటే కమ్యూనికేషన్, టెక్నికల్, ప్రొగ్రామింగ్‌లో నైపుణ్యం కలిగి ఉండాలి. ప్రస్తుతం ప్రభుత్వం సైతం ఉచితంగా ఆన్‌లైన్ శిక్షణ ఇస్తుంది. ఉచితంగా లభించే శిక్షణలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చు. విద్యా సంస్థలు సైతం పలు ప్రైవేట్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకొని ఆన్‌లైన్ శిక్షణలు ఇస్తున్నాయి. ఎచ్చెర్లలోని బీఆర్‌ఏయూ టెక్ సెక్షన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందజేస్తుంది. మరో పక్క మైక్రో సాఫ్ట్ ఆఫ్ స్కిల్లింగ్ ప్రొగ్రాం కింద 39 సర్టిఫికెషన్ కోర్సులను నిర్వహిస్తుంది.

కమ్యూనికేషన్ స్కిల్ అవసరం



విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్ కీలకం. ప్రాంగణం ఎంపికల్లో ఈ అంశానికి ప్రాధాన్యత నిస్తారు. ఇంటర్వ్యూలో విద్యార్థి సామర్థ్యం మదింపు చేస్తారు. కంపెనీ అవసరాలకు పనిచేస్తారా లేదా అన్న అంశానికి ప్రాధానత్య ఇస్తారు. ప్రతి విద్యార్థికి అనుకూల దృక్పథం ఉండాలి. ఉద్యోగం సాధించాక సైతం మంచి భవిష్యత్తు ఉండాలంటే కంపెనీ అవసరాలకు అనుగుణంగా నడుచుకోవాలి. వర్సిటీలు ఉచితంగా విద్యార్థులకు ఒప్పందాల ద్వారా శిక్షణలు అందిస్తున్నారు.

– జి.రామకృష్ణ, విభాగాధిపతి, సీఎస్ఈ, బీఆర్‌ఏయూ

సాంకేతిక అంశాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు సాంకేతిక అంశాలపై అవగాహన అవసరం. తాను పూర్తి చేసిన డిగ్రీ, బ్రాంచ్‌లో పట్టు ఉండాలి. విషయ పరిజ్ఞానం అత్యంత కీలకం. ప్రస్తుతం ఇంజినీరింగ్ విద్యలో అనేక మార్పులు వస్తున్నాయి. సిలబస్ దాటి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం. అందుకు ఆన్‌లైన్ శిక్షణలు, సర్టిఫికెషన్ కోర్సులు ఉపయోగపడతాయి.

– ఆర్.శ్రీధర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్, బీఆర్‌ఏయూ

నైపుణ్యం కీలకం



విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపిక కావాలంటే నైపుణ్యం కీలకం. గత ఏడాది వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గరిష్టంగా రూ.9 లక్షలు వార్షిక ప్యాకేజీకు సైతం ఎంపికయ్యారు. నైపుణ్యం ఉంటే మంచి ప్యాకేజీలకు ఎంపిక అవుతారు. విద్యార్థులు అన్ని విభాగాల్లో నైపుణ్యంపై దృష్టిపెట్టాలి.

– సీహెచ్ శ్రావణి, ప్లేస్‌మెంట్ అధికారి, బీఆర్‌ఏయూ

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని ఏఎస్పీ విఠలేశ్వరరావు అన్నారు. ఆర్మ్‌డు రిజర్వు పోలీసులకు 15 రోజుల పాటు నిర్వహించే మొబలైజేషన్ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. శిక్షణ కాలంలో ఆర్మ్‌డు రిజర్వు పోలీసుల విధులు సివిల్ పోలీసులు నిర్వహించనున్నారు. పెరేడ్, సాంకేతిక అంశాలు, ఫైరింగ్, వీఐపీ భద్రత, బాంబ్ స్క్వాడ్ పనితీరు, ఐపీసీ చట్టాలు, పోలీస్ శాఖకు సంబంధించిన ఇతర అంశాలు, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పోలీసు వృత్తి సవాళ్లతో కూడుకున్నదని, అందుకే ప్రతిఒక్కరూ ప్రశాంతంగా, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.ప్రసాదరావు, ఆర్ఐ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



వెలిచేటి సుమలత



బమ్మిడి అమ్మోజి

పొందూరు: ఏపీ గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా పొందూరుకు చెందిన వెలిచేటి సుమలత ఎంపికయ్యారు. ఈ నెల 20న గుంటూరులో ఏపీ గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ ఎస్.మహాలక్ష్మి, జనరల్ సెక్రటరీ డి.మధులతల ఆధ్వర్యంలో జరిగిన శ్రీకాకుళం జిల్లా అడహాక్ కమిటీ సమావేశంలో సుమలతను ఎంపికచేశారు. జిల్లా సెక్రటరీగా దొండపాటి కమల, కోశాధికారిగా బమ్మిడి అమ్మోజీ, వైస్ ప్రెసిడెంట్‌గా సీది భార్గవి, అడిషనల్ సెక్రటరీగా వాకాడ చంద్రిక, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.భారతి, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా బైరి లక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నీలిమ, రేవతి, జాయింట్ సెక్రటరీగా శోభ, ప్రమీలరాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోట హరిత, కార్యవర్గ సభ్యులుగా బొడ్డేపల్లి భాగ్యలక్ష్మి భాను తదితరులు ఎంపికయ్యారు.

మృతుని కుటుంబానికి సాయం



లలిత కుమారికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

జలుమూరు: ఇటీవల కోటబొమ్మాళిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కరవంజ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సంపతిరావు మల్లేశ్వరరావు కుటుంబానికి హైదరాబాద్‌లో పనిచేస్తున్న తోటి సిబ్బంది గురువారం ఆర్థిక సహాయం అందించారు. జలుమూరు ఎస్ఐ పి.పారినాయుడు, కరవంజ సర్పంచ్ జుత్తు నేతాజి చేతుల మీదుగా మల్లేశ్వర రావు భార్య లలితకుమారి, తండ్రి రామారావులకు చెరో రూ.60 వేలు మొత్తం రూ.1.20 లక్షలు అందించారు. కార్యక్రమంలో సంపతిరావు సింహాచలం, కృష్ణంరాజు, కర్రి చక్రధరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే మత్స్యకారుల సంక్షేమం



మత్స్యకారులకు వైఎస్సార్ సీపీ కండువా వేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

సంతబొమ్మాళి : మండలంలోని వడ్డితాండ్ర గ్రామంలో నిర్మాణంలో ఉన్న లక్ష్మీజగన్నాథస్వామి ఆలయానికి విరాళం ఇస్తానని చెప్పి తన పార్టీ కార్యాలయానికి పిలిచి బలవంతంగా టీడీపీ కండువాలను ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు వేశారని మత్స్యకారులు గురువారం తెలిపారు. తామంతా సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని స్పష్టం చేశారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని, పవర్‌ప్లాంట్ ఉద్యమంలో తమకోసం పోరాడి దువ్వాడ శ్రీనివాస్ జైలుకు సైతం వెళ్లారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని మత్స్యకారులు గాయిత్రీ మల్లేషు, మండల భాస్కరరావు, గాయిత్రీ నారాయణ, కారుణ్య, జాదవ్, ఉగాది, దీనబంధు, అర్జున, సింహాద్రి, కేశవలు తెలిపారు. వీరందరికీ ఎమ్మెల్సీ దువ్వాడ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు కోత సతీష్, హన్నూరావు, పి.రామకృష్ణ, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


మహిళల భద్రతకు ఫ్రెండ్లీ పోలీస్



నాటిక ద్వారా అవగాహన కల్పిస్తున్న బృందం

శ్రీకాకుళం క్రైమ్ : మహిళల భద్రతకు ఫ్రెండ్లీ పోలీస్ ఉందని.. ఎటువంటి కష్టమొచ్చినా ఆదుకుంటామని శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్ఐ-2 పి.లక్ష్మి అన్నారు. మహిళల రక్షణ కోసం ఉపయోగపడే చట్టాలను వివరిస్తూ స్ఫూర్తి పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళం డైమండ్ పార్కు, బలగ కూడలి వద్ద నాటిక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

అరుదైన గుడ్లగూబ



పాతపట్నం రామాలయం వీధిలో ఉపాధ్యాయుడు అల్లాడ అప్పలస్వామి ఇంట్లోకి గురువారం ఉదయం అరుదైన గుడ్లగూబ చొరబడింది. సాధారణంగా గుడ్లగూబలు రాత్రివేళ మాత్రమే తిరుగుతాయి. ఈ గుడ్లగూబ మాత్రం పగటి పూటే కనిపించడం, పొడవాటి ముక్కు, గోధుమ రంగులో మెరవడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. అరగంట తర్వాత ఎగిరిపోయిందని ఉపాధ్యాయుడు తెలిపారు. –పాతపట్నం

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత జవాన్ మృతి



మృతుడు వరప్రసాద్ (ఫైల్)



ఘటన స్థలంలో పడిఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

టెక్కలి రూరల్: స్థానిక పాత రవి ధాబా వద్ద గల వే బ్రిడ్జి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం దేవలబద్ర గ్రామానికి చెందిన విశ్రాంత బీఎస్ఎఫ్ జవాను పట్నాన వరప్రసాద్(42) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వర ప్రసాద్ తన వ్యక్తిగత పనుల కోసం బైక్‌పై టెక్కలి వచ్చి తిరిగి వెళ్తుండగా పాత రవిధాబా వద్ద అప్రోచ్ రోడఉడలో వెనుక నుంచి ధాన్యం లోడుతో వస్తున్న మ్యాక్సీ పికప్ వాహనం ఢీకొట్టడంతో వర ప్రసాద్ బండిపై నుంచి తుళ్లి పడిపోయాడు. వ్యాన్ అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడకక్కడే ప్రాణాలు పోయాయి. విషయం తెలుసుకున్న టెక్కలి ఎస్ఐ రామకృష్ణ, ఎస్ఐ-2 రమేష్‌బాబులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవ పంచనామా కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పద్మ, పదేళ్ల కుమార్తె లాస్య, ఎనిమిదేళ్ల కుమార్తె కావ్యలు ఉన్నారు.

అన్న దేశం కోసం చనిపోయాడు..

మృతుడు వరప్రసాద్ అన్నయ్య జోగులు కూడా ఆర్మీలో పనిచేశారు. రెండేళ్ల కిందట జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఫైరింగ్‌లో ఆయన వీర మరణం పొందారు. అప్పుడు మనస్తాపానికి గురైన వర ప్రసాద్ ఏడాది కిందటే ఉద్యోగానికి వాలంటరీ రిటైర్‌మెంట్ ఇచ్చేసి స్వగ్రామానికి తిరిగి వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారు. రోడ్డు ప్రమాదంలో రూపంలో ముంచుకువచ్చిన మృత్యువు అతడిని తీసుకెళ్లిపోవడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

అలికాం–బత్తిలి రోడ్డులో..

హిరమండలం: మండలంలోని కొండరాగోలు సమీపంలో అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భామిని మండలం నులకజోడు గ్రామానికి చెందిన అధికారి అభిమన్య(59) మృతిచెందాడు. ద్విచక్ర వాహనంపై ఏబీ రహదారి గుండా హిరమండలం వైపు వేగంగా వెళ్తుండగా కొండరాగోలు సమీపంలో స్పీడ్ బ్రేకర్లు దాటే సమయంలో ఒక్కసారి వాహనం ఎగరడంతో అదుపుతప్పి రోడ్డుపై పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అభిమాన్య అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.



అభిమన్య మృతదేహం

వేసవి సాగు.. లాభాలు బాగు

- జిల్లా వ్యాప్తంగా 1,77,218 ఎకరాల్లో రబీ పంటలు
- గత సీజన్ కంటే పెరిగిన వరి, మొక్కజొన్న, కట్టిజనుము విస్తీర్ణం
- ఆశాజనకంగా దిగుబడులు, గిట్టుబాటు ధరలు



నారాయణవలస వద్ద కనుచూపు మేర వరి పంట

నరసన్నపేట: జిల్లావ్యాప్తంగా వేసవి పంటల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. వరి పంట చేతికందిన తర్వాత రైతులు మొక్కజొన్న, మినుగు, పెసర, కట్టిజనుము, రబీ వరితో పాటు వివిధ వేసవి పంటల సాగుపై దృష్టి సారించారు. టమాటా, సన్‌ఫ్లవర్, చెరకు, నువ్వు, రాగులు, వేరుశనగ వంటి పంటలనూ సాగు చేస్తున్నారు. దీంతో జిల్లాలోని మెజార్టీ మండలాల్లో పొలాల్లో వేసవి పంటలు అధిక విస్తీర్ణంలో కనిపిస్తున్నాయి. వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం మంగళవారం నాటికి జిల్లాలో 1,77,218 ఎకరాల్లో రబీ పంటలు సాగులో ఉన్నట్లు తేలింది. ఈ క్రాప్ నమోదు మేరకు పంటల విస్తీర్ణం ఇది. ఇందులో నమోదు కాకుండా ఉన్న పంటలు మరో 24 వేల ఎకరాల పైనే ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రబీలో వరి సాధారణ విస్తీర్ణం కంటే ఈ ఏడాది అధికంగా సాగు అవుతోంది. మొత్తం 19,900 ఎకరాల్లో వరి వేశారు. మరో వారం రోజుల్లో విస్తీర్ణం మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. మొక్కజొన్న 41,900 ఎకరాలు, కట్టిజనుము 7297 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీటికి తోడు రాగులు, వేరుశనగ వంటి పంటల విస్తీర్ణం కూడా ఆశాజనకంగా ఉంది.

లాభసాటిగా ధర..

ఖరీఫ్ సీజన్‌లో వరి పంట దిగుబడులు బాగా వచ్చాయి. ప్రతి ఎకరాకు కనీసం ఐదు బస్తాల దిగుబడి పెరిగింది. మినుగు, పెసర దిగుబడులు కూడా పెరిగాయి. ఎకరాకు నాలుగు నుంచి ఐదు బస్తాల వరకూ దిగుబడులు వచ్చాయి. మంచు ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో దిగుబడులు తగ్గాయి. ఈ రబీ సీజన్‌కు పెసర, మినులు పంటలకు ప్రభుత్వ మద్దతు క్వింటాల్‌కు రూ.7755, రూ. 6600 ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ధరలు అధికంగా ఉన్నాయి. ఇక వేరుశనగ కూడా క్వింటాల్‌కు రూ.5850గా మద్దతు ధర ఉంది. దీనికి ప్రయివేటు మార్కెట్లో మంచి ధరలు ఉన్నాయి. కట్టి జనుము కూడా రైతులపై కనక వర్షం కురిపిస్తోంది. కేజీ కట్టి గింజలు రూ.40 నుంచి రూ.60 వరకూ కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ఖర్చులకు రూ. 5 వేలు పోయినా మిగిలిన డబ్బు అంతా రైతులకు అదనపు ఆదాయమే. రబీలో వరి (సుగర్ లెస్ ధాన్యాన్ని) రైతులు పండిస్తున్నారు. వీటి దిగుబడులూ అధికంగానే వస్తున్నాయి. 80 కేజీల ధాన్యం బస్తా రూ. 2 వేల పైనే పలుకుతోంది.

రైతులకు అండగా..



రబీలో వేసవి పంటల సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలిస్తున్నాం. మెలకువలు తెలియజేస్తున్నాం. ప్రస్తుతం వంశధారలో నీరు వస్తుండటంతో వేసవి పంటలకు అనుకూలంగా ఉంది. ఖరీఫ్ నుంచి రైతులకు అన్నీ కలసి వస్తున్నాయి. దిగుబడులు కూడా బాగున్నాయి. ధర కూడా ఆశాజనకంగా ఉంది. వేసవి పంటలకు కూడా ఈ-క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించుకోవాలి.

– కె. శ్రీధర్, వ్యవసాయ శాఖ జేడీ, శ్రీకాకుళం

ఆశాజనకంగా కట్టిజనుము..



కట్టిజనుము పంట ఆశాజనంగా ఉంది. నాలుగు ఎకరాల్లో వేశాను. దిగుబడి ఎకరాకు నాలుగు క్వింటాళ్లు వస్తుందని అనుకుంటున్నాం. దీనికి ఖర్చు, శ్రమ తక్కువే. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులంతా అధిక విస్తీర్ణంలో కట్టిజనుము వేశాం.

– వాకముళ్ల చక్రధర్, కామేశ్వరిపేట



యారబాడు వద్ద కట్టిజనుము పంట

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

శ్రీకాకుళం క్రైమ్ : మానవ అక్రమ రవాణాను నియంత్రించాలని జిల్లా యాంటీ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్ఐ ఎల్.వెంకటరావు అన్నారు. ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు చైల్డ్‌లైన్ ఎన్‌సీఎల్‌పీ ప్రతినిధులతో కలిసి గురువారం పట్టణంలోని నారాయణ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సిబ్బంది, ప్రతినిధులు పాల్గొన్నారు.